

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా గోపాలపురంలో బాలికల ర్యాలీ



వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

- ఎస్ఈబీ సీఐ వీరబ్రహ్మం
- మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

నిడదవోలు: సమాజంలో మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వాడకాన్ని పూర్తిగా నివారించడమే లక్ష్యమని ఎస్ఈబీ నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం అన్నారు. డ్రగ్ ఫ్రీ ఇండియా కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వాడకంపై కలిగే అనర్థాలపై శుక్రవారం మండలంలోని కాటకోటేశ్వరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్నడ్రగ్స్ మాఫియాను పూర్తిగా నిరోధించేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ తీవ్రంగా కృషి చేస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు., కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై ఆర్‌వీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్ఈబీ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం గోపాలపురంలో విద్యార్థినులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, డ్రగ్స్‌తో పట్టుబడితే చట్టపరమైన చర్యలు, శిక్షలు గురించి ఎస్ఈబీ సీఐ డి.సుధ జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ దేవరపల్లి స్టేషన్ ఎస్ఐ ఎం.రామశేషయ్య, ప్రధానోపాధ్యాయుడు పి.సోమశేఖర్, ఎస్ఈబీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్ఈబీ కొవ్వూరు అధికారులు అవగాహన కల్పించారు. ఎస్ఈబీ ఎస్ఐ బాసంతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలు జోలికి వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌరీనాథ్, అధ్యాపకులు, ఎస్ఈబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



వేగేశ్వరపురంలో సిమెంట్ బెంచీల వద్ద మానవత సంస్థ సభ్యులు

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేస్తున్నారు. రూ.17,500 వ్యయంతో గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో గ్రామస్తులు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జి వెంకటేశ్వరరావు తెలిపారు. అలాగే జులై 1 నుంచి మానవత సంస్థలో కొత్త సభ్యత్వాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ వి. చంద్రయ్య, సాయన సుబ్బారావు, ససపల రాజశేఖర్, గుప్త తదితరులు పాల్గొన్నారు.





30 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

దేవరపల్లి: నల్లజర్ల మండలం తూర్పు చోడవరంలో సారా తయారీ కేంద్రంపై దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊట, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ డి.సుధ శుక్రవారం తెలిపారు. సారా కలిగి ఉన్న కొండేటి వెంకటేశును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

25న వైఎస్సార్ సీపీ సేవాదళ్ ప్రాంతీయ సమావేశం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ సేవా దళ్ విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ చిన్నిమిల్లి వెంకట్రాయుడు శుక్రవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం తాడితోట ప్రాంతంలోని సంహిత కన్వెన్షన్ హాల్లో నిర్వహించే మండల సేవాదళ్ కన్వీనర్ల రీజియన్ స్థాయి సమావేశానికి మంత్రి వనితను ఆహ్వానించారు.

బ్యాంక్ కార్యాలయం ఏర్పాటు

చాగల్లు: సీహెచ్‌సీబీ బ్యాంక్ నూతన శాఖ కార్యాలయాన్ని చాగల్లులో ఏర్పాటు చేశారు. కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా, చాగల్లు మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ ఈ బ్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఇన్‌చార్జ్ వి.వెంకట సాయికృష్ణ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, నాయకులు గెడా శ్యామ్, ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్ పాల్గొన్నారు.





విద్యాహక్కును కచ్చితంగా అమలు చేయాలి

కంబాలచెరువు: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలన్నీ విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అర్బన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల కరెస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనలను అనుసరించి ప్రైవేటు పాఠశాలల నిర్వహణ ఉండాలన్నారు. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విధిగా పొందాలని, డ్రైవర్‌ను నియమించేటప్పుడు అతడి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను విధిగా నోటీసుబోర్డులో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో అర్బన్ రేంజ్ మండల విద్యాశాఖాధికారి 2 రమా రజని పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధి గంగిరెడ్ల కాలనీలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పోలవరపు నూకరాజును శుక్రవారం మధ్యాహ్నం బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్ అరెస్టు చేశారు. అతడి నుంచి 180 ఎంఎల్ 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి రైల్వే స్టేషన్‌లో మొబైల్ ఫోన్ దొంగతనాలు చేస్తున్న చర్చిపేటకు చెందిన ఆముదాల ఆనంద్, షేక్ అమద్ అలీకి విజయవాడ రైల్వే కోర్టు రిమాండ్ విధించిందని జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపారు. వారి నుంచి రూ.52 వేల విలువైన మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

కె.గంగవరం: వైఎస్సార్ పశు బీమాను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం పశుసంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణ తెలిపారు. దంగేరు గ్రామంలో శుక్రవారం పశు బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి పాడి పశువుకు మూడేళ్లకు గాను రూ.384, గొర్రెకు సంవత్సరానికి రూ.36 చెల్లిస్తే బీమా వర్తిస్తుందన్నారు.



















నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు శంకర్రావు మృతి


ఆతం శంకర్రావు(ఫైల్)

నిడదవోలు: నాయీ బ్రాహ్మణ సేవా సంఘ పట్టణ శాఖ అధ్యక్షుడు ఆతం శంకర్రావు (73) గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలియడంతో పట్టణంలో శుక్రవారం సెలూన్ షాపులను మూసి వేసి నాయీ బ్రాహ్మణులు ఆయనకు నివాళులర్పించారు. గత 25 ఏళ్లుగా శంకర్రావు సంఘాధ్యక్షుడుగా కొనసాగుతూ సంఘాభివృద్ధితో పాటు నాయీ బ్రాహ్మణ సేవా సంఘ భవన నిర్మాణానికి కృషి చేశారు.















మేలు చేశాం.. మళ్లీ ఆశీర్వదించండి


వెలగదుర్రులో ఓ వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- వెలగదుర్రులో గడప గడపకూ..

ఉండ్రాజవరం: రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని వెలగదుర్రు గ్రామంలో ఆయన శుక్రవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి పాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అలాగే గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందీ వివరించారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లు పంపిణీ చేశారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కొందరు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు ధనిశెట్టి భ్రమరాంబ, ముదునూరి సతీష్ వర్మ, సాగి రామకృష్ణంరాజు, ముదునూరి రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరిస్ కెమిటెక్‌లో నేత్ర వైద్య శిబిరం


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నిడదవోలు రూరల్: కోరుమామిడి శివారు అమ్మెపల్లిలోని ఫ్లోరిస్ కెమిటెక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్లోరిస్ కెమిటెక్ ఎండీ అక్కినేని రాజశేఖర్ శిబిరాన్ని ప్రారంభించారు. జాగృతి కంటి ఆసుపత్రి వైద్యులు కెమిటెక్ ఉద్యోగులకు, పరిసర గ్రామాల ప్రజలకు నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ పిన్నమనేని రామారావు, సేల్స్ ఆఫీసర్ ఆచంట రామకృష్ణ, ఉద్యోగులు బాల అంకయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోతవరంలో..


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

నల్లజర్ల: మండలంలోని పోతవరం గ్రామంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. భగవాన్ సత్యసాయి సేవాసంస్థ, నల్లజర్ల, పోతవరం సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పోతవరం సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, పోతవరం సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులు 97 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆరుగురికి ఆపరేషన్లు చేయాలని 27 మంది కళ్లజోళ్లు వేసుకోవాలని సూచించారు. వారందరికీ వేమగిరిలో ఉచిత కంటిఆపరేషన్లు చేస్తారని సత్యసాయి సేవ మండల కన్వీనర్ గంటా శివరామారావు చెప్పారు.

ఆరుగురిపై పిచ్చికుక్క దాడి


అన్నదేవరపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

తాళ్లపూడి: పిచ్చి కుక్క దాడితో అన్నదేవరపేట వాసులు భీతిల్లుతున్నారు. ఓ పిచ్చికుక్క శుక్రవారం ఆరుగురిపై దాడి చేసింది. ఈ దాడిలో గాయపడిన ఓ మహిళ ఒక వ్యక్తి, మరో బాలిక అన్నదేవరపేట పీహెచ్‌సీకి వచ్చి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. వారితో పాటు మరో ముగ్గిరిపై కూడా పిచ్చికుక్క దాడి చేసినట్టు ఆ గ్రామస్తులు చెబుతున్నారు.

వసతి గృహాల సందర్శన


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: నగరంలోని పలు సంక్షేమ వసతి గృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం సందర్శించారు. గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధులను, వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఎస్టీ బాలికల వసతి గృహం, ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్, ఎస్టీ బాలురు హాస్టల్, బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ మాతృసంస్థ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు నిరుపమానమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. శుక్రవారం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, సిటీ అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగారావు, రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ ఏపీఆర్ చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీసులో అదాలత్

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ వినియోగదారులు, పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించేందుకు రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీసు కేంద్రంగా డివిజన్ స్థాయి డాక్ అదాలత్, పెన్షన్ అదాలత్‌ను నిర్వహించినట్లు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధరమ్ తెలిపారు.























నాడు అసాధ్యం .. నేడు సుసాధ్యం

- అన్నదాతలకు అండగా ప్రభుత్వం
- సాగుకు అన్నివిధాలా ప్రోత్సాహకాలు
- రాయితీపై యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు
- కొండంత అండగా రైతు భరోసా కేంద్రాలు



ఆవపాడు రైతు భరోసా కేంద్రం

నల్లజర్ల: రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నమ్ముతోంది. అందుకే అధికారం చేపట్టాక ఈ నాలుగేళ్లుగా అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. సాగుకు పెట్టుబడి సాయం అందిస్తోంది. సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తోంది. ఊరి ఊరికో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి విత్తనం నుంచి పంట కొనుగోలు వరకూ అన్నదాతలకు ఆసరాగా నిలుస్తోంది. పీఎం కిసాన్ యోజన, వైఎస్సార్ రైతు భరోసా కింద నల్లజర్ల మండలంలోని 10,178 రైతులకు ఈ ఏడాది రూ.7.63 కోట్ల సాయం అందించారు. యంత్ర సేవా పథకం కింద 15 రైతు గ్రూపులకు ట్రాక్టర్, యంత్ర పరికరాలకు ఈ ఏడాది రూ.68.27 లక్షలు రాయితీగా అందించారు. 821 మంది రైతుల నుంచి 8,217 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.16.76 కోట్లను సకాలంలో రైతుల ఖాతాలకు జమ చేశారు.

ఊరూరికీ భరోసా..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏ చిన్న అవసరం వచ్చినా రైతులు మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. నేడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల వద్దకే వారికి అవసరమైన సేవలు చేరాయి. ఇందుకోసం మండలంలో 22 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఆరు రైతుభరోసా కేంద్రాల భవనాల నిర్మాణాలు ఇప్పటికే పూర్తవగా, మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వాటి ద్వారా రైతులకు విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకూ వ్యవసాయ సహాయకులు అండగా ఉంటున్నారు. సాగులో సూచనలు, సలహాలు అందించడంతో పాటు ఈ–క్రాప్ నమోదు, పంట నష్టం వస్తే వెంటనే అంచనా వేసి ఇన్‌పుట్ రాయితీ అందించే చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడి సిబ్బంది రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించడం, పంటల బీమా వంటివి చేపడుతున్నారు. పశువుల బీమా, వైద్య సహాయం, వాటికి కావాల్సిన సంపూర్ణ దాణా విత్తనాలు అందించడంలోను ఆర్బీకేలు విశేష సేవలు అందిస్తున్నాయి.

మాట నిలబెట్టుకున్నారు



ప్రజా సంకల్పయాత్రలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని జగనన్న మాటిచ్చారు. ఆ ప్రకారం నాలుగేళ్లుగా ఆర్థిక సాయం అందించారు. ఈ ఏడాది తొలివిడత సాయాన్ని ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే రైతుల ఖాతాలకు జమ చేశారు. రైతుల కష్టాలు తెలుసుకొని సాగుకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఏటా రైతులకు అందిస్తున్న రూ.13,500 పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతోంది.

– వామిశెట్టి సుబ్బారావు, రైతు, ఆవపాడు

రుణపడి ఉంటాం



మాది నల్లజర్లలో సిద్ధి వినాయక రైతు గ్రూపు. రెండు రోటోవేటర్లు, ఒక గడ్డి కట్టే యంత్రం తీసుకున్నాం. మొత్తం రూ.12 లక్షలకు 40 శాతం రాయితీ ఇచ్చారు. చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో తక్కువ ఖర్చుతో వరికోతలు కోస్తున్నాం. సాగులో యాంత్రీకరణ వినియోగం పెరిగింది. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు ఇస్తున్న ప్రభుత్వానికి రుణపడిఉంటాం.

– రాయుడు పెదరాయుడు, రైతు గ్రూపు కన్వీనర్, నల్లజర్ల

రైతుల వద్దకే సేవలు



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం రైతులు లోగడ మండల కేంద్రాలకు వచ్చి ఇబ్బందులు పడే వారు. ఇపుడు రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో వారి ఇబ్బందులు తొలగాయి. అన్నీ సేవలు రైతు ముంగిటకే వస్తున్నాయి. సత్వర సేవలు పొందగలుగుతున్నారు. రైతు భరోసా సాయాన్ని అక్కడే నమోదు చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంటున్నాయి. ఇన్‌పుట్ సబ్సిడీలు సైతం రైతు భరోసా కేంద్రాల నుంచే అందుకోగలుగుతున్నారు.

కె.కమల్‌రాజ్, మండల వ్యవసాయాధికారి, నల్లజర్ల

పొగాకు ధరలు పైపైకి..

- కిలో గరిష్ట ధర రూ.280
- నగటు ధర రూ.270
- 27.72 మిలియన్ కిలోల విక్రయాలు


దేవరపల్లి వేలం కేంద్రానికి రైతులు అమ్మకానికి తీసుకు వచ్చిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: మార్కెట్లో పొగాకు ధర రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నెలలో కిలోకు రూ.65 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఎన్ఎల్ఎస్ పొగాకుకు డిమాండ్ ఉండడం, ఎగుమతి ఆర్డర్లు రావడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 65 ఏళ్ల క్రితం పొగాకు సాగుకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి రైతులు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని పంటను సాగు చేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక సన్న, చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయి, సాగుకు దూరంగా ఉన్నారు. పెద్దరైతులు మాత్రం పొగాకు సాగును కొనసాగిస్తున్నారు. 65 ఏళ్ల పొగాకు చరిత్రలో ఈ ఏడాది మార్కెట్ రికార్డు సృష్టిస్తోంది. మార్చి 23న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో బోర్డు అధికారులు ఈ–వేలం ప్రారంభించారు. కిలో గరిష్ట ధర రూ.210తో కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ ధర జూన్ మొదటి వారం వరకూ నిలకడగా ఉంది. అనంతరం రోజురోజుకు గరిష్ట ధర పెరగుతూ వస్తుంది. మే నెలలో మార్కెట్ కంటే ప్రస్తుతం కిలోకు రూ.65 అదనంగా లభిస్తోంది. ముందుగా అమ్ముకున్న రైతులు క్వింటాల్‌కు రూ.6 నుంచి 7 వేలు నష్టపోయారు. మే నెలలో లో గ్రేడుకు మార్కెట్లో డిమాండ్ ఏర్పడడంతో రైతులంతా లో గ్రేడును గిట్టుబాటు ధరకు అమ్ముకున్నారు. లోగ్రేడుకు కిలో రూ.200 ధర లభించింది. ఏటా లో గ్రేడుకు కిలో రూ.18 నుంచి 20 రేటు లభించేది.

బ్రైట్ గ్రేడ్ పొగాకు విక్రయాలు

ప్రస్తుతం బ్రైట్ గ్రేడు పొగాకు విక్రయాలు జరుగుతున్నాయి. రైతుల వద్ద బ్రైట్ గ్రేడు పొగాకు ఎక్కువగా ఉండడంతో మంచి ధర లభిస్తోంది. ఈ నెలాఖరుకు ఈ ధర రూ.300కు చేరుతుందని రైతులు అంటున్నారు. శుక్రవారం మార్కెట్లో కిలో గరిష్ట ధర రూ.280 కాగా, సగటు ధర రూ.270 లభించింది. దేవరపల్లి వేలం కేంద్రంలో అత్యధిక ధర రూ.280 లభించినట్టు వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో శుక్రవారం నాటికి 27.72 మిలియన్ల పొగాకు విక్రయాలు జరగ్గా, గరిష్ట, సగటు ధర ఈ విధంగా ఉన్నాయి. దేవరపల్లి వేలం కేంద్రంలో 5.34 మిలియన్ల కిలోలు, జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రంలో 5.97, జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో 5.27, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 6.19, గోపాలపురం వేలం కేంద్రంలో 4.93 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం రైతుల వద్ద ఇంకా 25 మిలియన్ల కిలోల పొగాకు విక్రయానికి సిద్ధంగా ఉంది. దేవరపల్లి వేలం కేంద్రంలో కిలో గరిష్ట ధర రూ.280, సగటు ధర రూ.264.51, జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రంలో గరిష్ట ధర రూ.275, సగటు ధర రూ.272.54, జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో గరిష్ట ధర రూ.276, సగటు ధర రూ.268.71, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో గరిష్ట ధర రూ.277, సగటు ధర రూ.273.03, గోపాలపురం వేలం కేంద్రంలో కిలో గరిష్ట ధర రూ.279, సగటు ధర రూ.271.44 లభించింది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


రాయుడుపాకలు గ్రామంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ కార్యాచరణ రూపొందించారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆయన శుక్రవారం రాయుడుపాకలు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకూలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జగనన్న సురక్షలో భాగంగా నెలరోజుల్లో రూరల్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళతామన్నారు. క్యాంపులకు ముందుగా వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా గృహసారథిని వెంట తీసుకుని ప్రతి ఇంటినీ సందర్శిస్తారన్నారు. కౌలు గుర్తింపుకార్డులతో సహా పది రకాల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యాక జరిగే క్యాంపుల్లో అక్కడికక్కడే వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు.

శాకంబరిగా తలుపులమ్మ తల్లి


శాకంబరిగా ద్రాక్షారామ తలుపులమ్మ తల్లి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో బియ్యంపేట వద్ద వేంచేసి ఉన్న తలుపులమ్మ తల్లి శుక్రవారం శాకంబరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన మాణిక్యాంబా మహిళా సమాజం నిర్వాహకురాలు కారుమూరి వజ్రం ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. కుంకుమ, లలితా సహస్రనామ పూజలు చేశారు. ఈ ఏర్పాట్లను కమిటీ సభ్యులు వాసంశెట్టి చిన్ని, వాసంశెట్టి భవానీ శంకర్, బాపూజీ, చిన్ని, బాలం భీమశంకరం, వాసంశెట్టి రవికుమార్, రెడ్డి మణికంఠ పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు పాల్గొన్నారు.

పంట బోదెనే పూడ్చేశారు!


పనులను అడ్డుకున్న సర్పంచ్ గోవిందరాజులు, కార్యదర్శి సాయిప్రసాద్

మండపేట: రియల్ ఎస్టేట్ భూములకు అప్రోచ్ రోడ్డు కోసం రహదారి వెడల్పు పేరిట ఏకంగా పంట బోదెను పూడ్చి పెట్టే పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్, కార్యదర్శి సంఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. మారేడుబాక ఇందిరమ్మ కాలనీ రోడ్డును ఆనుకుని అనపర్తి నియోజకవర్గం పులగుర్త గ్రామానికి చెందిన పంట పొలాలు ఉన్నాయి. ఈ పొలాలు పట్టణానికి రెండు కిలోమీటర్ల సమీపంలో ఉండటంతో కొందరు లేఅవుట్‌లుగా మార్చుతున్నారు. ఈ పొలాల నుంచి కాలనీ మీదుగా మండపేట వచ్చే రోడ్డు కేవలం మూడు నుంచి నాలుగు మీటర్లు మాత్రమే వెడల్పు ఉంటుంది. గతంలో అధ్వానంగా ఉండే ఈ రోడ్డును వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసింది. దీనిని మరింత వెడల్పు చేయడం ద్వారా తమ భూముల విలువ పెంచుకునేందుకు రోడ్డును ఆనుకుని ఉన్న పంటబోదెపై భూయజమానుల కన్నుపడింది. రోడ్డును విస్తరించే పేరిట అనధికారికంగా సుమారు మూడు మీటర్ల వెడల్పు కలిగిన పంట బోదెను ఇందిరమ్మ కాలనీ వద్ద దాదాపు రెండు వందల మీటర్లు మేర పూడ్చేశారు. ఈ బోదె దిగువన సుమారు 80 ఎకరాలు సాగవుతున్నట్టు రైతులు తెలిపారు. రోడ్డును కొంత మేర వెడల్పు చేసి తర్వాత కాలువను యథావిధిగా తవ్వుతామని యజమానులు చెప్పారని వారన్నారు. పంట బోదెను పూడ్చివేసిన విషయం తెలిసి సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, గ్రామ కార్యదర్శి సాయి ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది కాలనీ వద్దకు చేరుకుని పనులు నిలుపుదల చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా పంట బోదెను పూడ్చివేస్తున్న విషయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే పనులు ఆపించాలని ఆదేశించారని సర్పంచ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, వార్డు సభ్యుడు గండి నాని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆసరా

కాజులూరు: ప్రమాద బాధిత కుటుంబాలకు జగనన్న ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గొల్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల ఆటలాడుతుండగా.. అగ్నికుల క్షత్రియుల పేటకు చెందిన శేరు సత్తిబాబు కుమారుడు మనోజ్ చంద్రశేఖర్ (9) ప్రమాదవశాత్తూ మెడకు తాడు బిగించుకుని మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంత్రి వేణు రూ.2 లక్షలు మంజూరు చేయించి, శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఊయల తాడుకు, ఉరి తాడుకు తేడా తెలియని ఆ పసివాడు ప్రతి నెల పిల్లల బరువు తూచేందుకు ఉపయోగించే తాడుతో ఊయల ఊగుతూ తాడు మెడకు బిగుసుకుని మృతి చెందాడని అన్నారు. ఈ సంఘటనలో సంబంధిత అంగన్‌వాడీ హెల్పర్‌ను సస్పెండ్ చేశారని మంత్రి చెప్పారు.

















రివర్ ఫ్రంట్ పార్కు పనులు వేగవంతం చేయాలి

నిడదవోలు: పట్టణ వాసుల చిరకాల కోరికైన రివర్ ఫ్రంట్ పార్కు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదేశించారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే గూడెం రైల్వే గేటు నుంచి స్థానిక చినకాశి రేవు వరకూ నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ పార్కు పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. కెనాల్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా 'రుడా' నిధులు రూ.1.50 కోట్ల వ్యయంతో రివర్ ఫ్రంట్ పార్కు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు పనుల పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ పార్కు నిర్మాణంలో అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు.ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించి ప్రజలకు ఆహ్లాదంతో పాటు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రివర్ ఫ్రంట్ పార్కులో వాకింగ్ ట్రాక్, లాండ్ స్కేపింగ్, గ్రీన్ కార్పెట్, విద్యుత్ కాంతులతో కళకళలాడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడే చిన్నారుల ఆటలకు కూడా స్థలాన్ని కూడా కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగులు వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, పువ్వుల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, ఎండీ షకీరాబేగం, బిర్రె పార్వతి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈఈ మాధవీలత, టౌన్ ప్లానింగ్ అధికారి సుప్రియ తదితరులు పాల్గొన్నారు.


పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు











సీపెట్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నల్లజర్ల: విజయవాడలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ (సీపెట్)లో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సీపెట్ జాయింట్ డైరెక్టర్ చింతా శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి మూడేళ్ల వ్యవధి గల డిప్లమో, రెండేళ్ల వ్యవధి గల జాబ్ ఓరియంటెడ్ కోర్సులని ఆయన చెప్పారు. డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ)కోర్సులకు బీఎస్సీ విద్యార్హతల గల వారు అర్హులన్నారు.అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినీవిద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. ఆసక్తి గల వారు కె.సుందర్రావు 93980 50255 అనే నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర్‌రామ్‌ను సత్కరిస్తున్న రొటేరియన్లు

నిడదవోలు: యువతను రోటరీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని రోటరీ క్లబ్– 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కర్ రామ్ అన్నారు. రోటరీ గవర్నర్ అఫీషియల్ విజిట్‌లో భాగంగా నిడదవోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని కాటకోటేశ్వరంలో నిర్మించిన రోటరీ బస్ షెల్టర్, రోటరీ ఆడిటోరియంలో ఆఫీస్ రూమ్‌లను గవర్నర్ భాస్కర్‌రామ్ ప్రారంభించారు. ఉనకరమిల్లి కమ్యూనిటీ హాలుకు కుర్చీలు అందజేశారు. రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. వివిధ శాఖల ఉద్యోగులను ఒకేషనల్ అవార్డులతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు నిడదవోలు క్లబ్ తరఫున రోటరీ పోలియో ఫండ్‌కు రూ. 2 లక్షల చెక్కును గవర్నర్‌కు అందజేశారు. నిడదవోలు రోటరీ క్లబ్‌కు కరెంటు ఇబ్బందులు లేకుండా జనరేటర్ ఏర్పాటుకు డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ భాస్కర్ రామ్ తన సొంత నిధులు రూ. 8 లక్షలు క్లబ్ సభ్యులకు అందజేశారు. అనంతరం గవర్నర్‌ను గజమాల, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, క్లబ్ కార్యదర్శి ఎండీ ఫయాజ్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అయినీడి పల్లారావు తదతరులు పాల్గొన్నారు.

కేసు కొట్టివేత

రాజమహేంద్రవరం రూరల్: కోవిడ్ విధుల్లో భాగంగా ఆవరోడ్డు వాంబే గృహాల దగ్గర విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు అంజూరి విజయ కుమార్, రాయుడు శ్రీనివాసరావు మీద పైలా సతీష్, పైలా లక్ష్మణరావు అనే కార్మికులు ఇటుకలతో దాడి చేసి, విధులకు ఆటంకం కలిగించారనే కేసును ఆరో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న కొట్టివేశారు. ఈ కేసులో పోలీసులతో సహా మొత్తం ఆరుగురు సాక్షులను విచారించి, పై విధంగా తీర్పు ఇచ్చారు. నిందితుల తరఫున ముప్పాళ్ల సుబ్బారావు వాదించారు.





జగనన్న సురక్ష .. అది మీ బాధ్యత

- ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు పరిష్కరించాలి
- అవగాహన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణపై అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లతో శుక్రవారం పట్టణంలోని కిరణా మర్చంట్స్ హాల్లో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించే సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజల సమస్యలు ఓపికతో విని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ప్రతి రోజూ నిర్వహించే క్యాంపుల్లో భాగంగా కుల, ఆదాయ, వివాహ, జనన ధ్రువీకరణ పత్రాలు, డెత్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, బియ్యం కార్డు, కుటుంబాల విభజన, సీసీఆర్‌సీ, మ్యుటేషన్స్, ఫోన్ నంబర్‌తో ఆధార్ లింకేజీ తదితర 11 రకాల సర్టిఫికెట్లు జారీ చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జూలై 1 నుంచి మండల స్థాయి అధికారులు టీమ్‌గా ఏర్పడి సచివాలయంలో ఒక రోజు పూర్తిగా అందుబాటులో ఉంటారన్నారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని వారు పట్టణంలో ఒక్కరూ కూడా ఉండరానే సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎండీ షకీరాబేగం, ఆకుల ముకుందరావు, ఆలమూరి భారతి, మానుపాటి లక్ష్మి, తేటేటి ఝాన్సీరాణి, పట్టణ గృహసారథుల ఇన్‌ఛార్జి ఎస్‌కే చాన్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూరు శాతం వినతులు పరిష్కరించేందుకు..

నిడదవోలు రూరల్: పాలనను మరింత చేరువ చేసేందుకు, ప్రజా వినతులను నూరు శాతం పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని రూపొందించారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై పందలపర్రులో శుక్రవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ఓ ఒక్క అర్హుడూ పథకాల లబ్ధి పొందకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సురక్ష కార్యక్రమంలో ఎలాంటి సర్వీస్ ఫీజు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా జారీ చేస్తారన్నారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, జీడిగుంట సర్పంచ్ మొక్కరాల శ్రీనివాస్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీడీఓ పి.శామ్యేలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్

తాళ్లపూడి: జగనన్న సురక్షపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో టీడీ వెంకటరమణ వీక్షించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

పట్టణంలో జూలై ఒకటి నుంచి..

కొవ్వూరు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పట్టణంలో జూలై 1 నుంచి 25 వరకూ సచివాలయాల వారీగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. 1న శ్రీరామకాలనీ, 4న క్రిస్టియన్ పేటలో, 6న మద్దిపట్ల వారి వీధిలోను, 11న గౌతమినగర్-1లోను సమావేశాలు నిర్వహిస్తామన్నారు. 13న గౌతమీనగర్-2లో, 15న ఔరంగబాద్‌లో, 18న ఎన్‌జీవో హోమ్-1లో, 20న ఎన్‌జీవో హోమ్-2, 22న ఇందిరమ్మ కాలనీలోను, 25న ఆవుల వారి వీధిలోను సచివాలయం వారీగా సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. కుల, నివాస, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్స్ అందజేస్తారు.రేషన్ కార్డులో పేర్లు మార్పు, షిఫ్టింగ్, కొత్త రేషన్ కార్డులు మంజూరు వంటివి అందజేస్తారన్నారు.

పెరవలి: 'జగనన్న సురక్ష' ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హులు అందరికీ అందేలా చర్యలు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. జగనన్న సురక్ష పథకంపై పంచాయతీ, సచివాలయ సిబ్బందికి శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ రాజరాజేశ్వరి, హౌసింగ్ ఏఈ వెంకన్నబాబు, సూరజన్ అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని కార్మికుల వినతి

కొవ్వూరు: తమకు హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్‌ను కార్మికులు కోరారు. మునిసిపల్ ఇంజినీరింగ్ అండ్ టౌన్ ప్లానింగ్, శానిటరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వారు కమిషనర్‌ను కలిసి హెల్త్ అలవెన్స్ జీవోను అందజేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల హెల్త్ అలవెన్సులను జూన్ జీతాలతో కలిపి కార్మికుల అకౌంట్‌లో జమ చేస్తామని హామీ ఇచ్చారని ఆ సంఘం అధ్యక్షుడు రాజాన అప్పారావు గుర్తు చేశారు. దానిని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. మీసాల కిషోర్, దుర్గాప్రసాద్, అల్లం సత్యనారాయణ, రవీంద్రరావు పాల్గొన్నారు.

28న కొవ్వూరులో వాహనాల వేలం

కొవ్వూరు: పలు సారా కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనాలకు ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు కొవ్వూరు ఎస్ఈబీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. రెండు సైకిళ్లు, ఏడు మోటార్ సైకిళ్లకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు తమ ఆధార్ నంబర్ జిరాక్సు కాపీ, రూ.ఐదు వేల ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు వెంటనే మొత్తం సొమ్ముతో పాటు 18 శాతం జీఎస్‌టీ కలిపి చెల్లించాలన్నారు. వివరాల కోసం కొవ్వూరు ఎస్ఈబీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.